


అన్నయ్య ఇచ్చిన పుస్తకాలు కిటికీలో పెట్టి, అక్కడే నిలబడి చూస్తుండి పోయింది శాంత. నాలుగు నెలలున్నాయి కదా, చదువు, పరవాలేదు అన్నాడు అన్నయ్య. చదవగలదా తను ? చదవక పోయినా పరీక్షలు రాకామానవు, తను కూ ర్చోకా తప్పదు. కానీ క్రిందటి మాటంత కష్టమనిపించడంలేదు పరీక్ష. ఈమాటు అలవాటౌతుంది. అన్నీ అల వాటౌతాయి యిల్లాగే.

అమ్మ పిలుస్తోంటే వెళ్ళింది వంటిం ట్లోకి. కాఫీ ఇచ్చింది అమ్మ. "శేషు నిద్రపోతున్నాడా ? ఫ్లాస్కులో పోస్తాను పాలు వాడికి" అని చెప్పి నాన్న గారికి కాఫీ ఇవ్వడానికి వెళ్ళింది. గుమ్మంమీద కూర్చుని కాఫీ త్రాగుతూ నాన్నగారు ఏమయినా అంటారేమో అన్నట్లు వినసాగింది శాంత.

అననే అన్నా రాయన—"పుస్తకాలు పట్టుకొచ్చాడా? వెడుతుందిటా పరీక్షకి?" అని.

"ఎవరి చాదస్తం వాళ్ళది. సరే కానీ!" అన్నారు కొంచెం ఆగి. అమ్మ తిరిగివచ్చి శాంతవంక చూసింది. ఆమె కనుబొమలు ముడి వడ్డాయి. "గుమ్మం మీద కూర్చుంటా వెందుకు — పాతికేళ్ళు వచ్చినా ఆమాత్రం తెలియదా ఏమిటి?" అన్నది.

శాంత లేచి నిలబడి తొందరగా కాఫీ త్రాగేసింది. గ్లాసు పట్టికెళ్ళి కడిగితెచ్చి లోపల పెట్టింది. కూర తరుగుదామని బుట్ట తీసి చూసింది.

"ఇప్పట్నుంచీ అక్కర్లేదు. కాస్సే పయాక నేను తరుక్కుంటానులే. నువ్వు పోయి చదువుకో" అన్నది అమ్మ.

శాంత గదిలోకి వెళ్ళింది. అన్నయ్య తెచ్చిన పుస్తకాలు తన కేమీ సంతోషం కలిగించవు. కానీ ఇంట్లో మాత్రం చాలా అలజడిని కలిగిస్తున్నాయి. బి.ఏ. పరీక్షకు తను వెళ్లాలనుకోకపోయినా కేవలం అన్నయ్య ప్రోద్బలంవల్ల కట్టింది. ఇంగ్లీషు, తెలుగు ఎల్లాగు అయిపోయినాయి. గ్రూపు కాకుండా వున్నది. తను అప్పుడు – ఎంతో గొడవగా మనస్సున్నప్పుడు చదువుమాటే ఆలోచించలేదు. కానీ అప్పుడు తాను టీచరు ట్రయినింగులో చేరాలని నాన్నగారు అన్నారు. శేషుకి నాలుగో ఏడు. వాడితో అమ్మ వేగుతుంది కానీ ఎంత కాలం! తనతోనే ఎవరూ వేగలేకుండా ఉన్నారు–అన్నయ్య తప్ప.

... శాంతకి పదహారోఏడు వచ్చినప్పటి కంతా ప్రారంభమయ్యాయి– ఆమెకి పెళ్ళిచూపులు; నలుగురైదుగురు వచ్చి చూసివెళ్ళింతర్వాత ఏ సంబంధమూ కుదరకుండాపోతుం దని అమ్మ గొడవపడేది. తనకి కంట్లో వున్న మెల్ల దీనికి కారణమని శాంతకి తెలుసు. ఇల్లా వుంటుంది పిల్ల అని చెప్పి తీసుకు వచ్చినా సరే, వాళ్లొచ్చి చూసివెళ్లేవారు. ఇంకేమీ కబురు పెట్టేవారు కాదు. పెళ్ళిచూపులంటే ముందే భయం భయంగా వుండేది. అలంకారం చేసుకో బుద్ధయేదికాదు. కళ్ళెత్తి చూడాలంటే చూపుల కొచ్చినవాళ్లు ఏమంటారోనని ప్రాణం గిజగిజలాడేది.

అల్లాంటి పరిస్థితిలో విజయసారథి – సన్నగా, పొడుగ్గా, కళగా వుండే విజయసారథి – శాంతని చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. యమ్. ఎస్‌సి. చదువుకున్నాడు. పైకి వచ్చే అవకాశం ఉన్నవాడు. శాంతకిభయమే. చివరివరకూ భయమే. తనని అతను సరిగ్గా చూడకుండా ఒప్పుకున్నాడేమోనని. మొదటిసారి తలవంచుకుని కూర్చున్న శాంత ముఖాన్ని పైకెత్తి అతను చూడబోతోంటే ఆమె కళ్లు గట్టిగా మూసుకుంది. దడదడలాడే గుండెలతో వణికిపోయింది.

"వెర్రిపిల్లా" అంటూ అతను దగ్గరకు తీసుకున్నప్పుడు కృతజ్ఞతతో, ప్రేమతో, భక్తితో తను ఎన్నడిలా ఎరుగని పులకరింపుతో అతని గుండెల్లో ముఖం దాచుకుంది.

రెండేళ్లు కాపురం విశాఖపట్నంలో. అతను క్రొత్తగా పరీక్ష పాసై, ఉద్యోగంలో చేరాడు. కొంచెం చొరవ ఏర్పడ్డాక అడిగింది శాంత, "మెల్లకన్ను అని తెలిసికూడా చేసుకున్నావేం?" అని.

"అది అదృష్టంమెల్ల. నా అదృష్టం మెల్ల" అని రెప్పలమీద ముద్దుపెట్టుకున్నా డతను. 'మా వదిన ఎటు

చూస్తోందో మా అన్నయ్యకి ఎలయాలి' అంటూ ఆడబడుచు లిద్దరూ వేళాకోళం ఆడినప్పుడు శాంత ఏడిచింది. కానీ అతను ఆదరించినప్పుడు అన్నీ మరిచిపోయింది. అదొక్కటే తనకి కావలసింది అనుకుంది. అతను తనతో గంటలకొద్దీ గడపకపోయినా, రాత్రింబవళ్లు యూనివర్శిటీలోనే పనులున్నాయంటూ వుండిపోయినా, యింటికొచ్చి చల్లగా పలుకరించేసరికి సర్వం మరుపుకి వచ్చేవి.

అతను పై చదువుకని ఢిల్లీకి వెళ్ళాడు. డాక్టరేట్ అక్కడ డవడానికవకాశం వచ్చింది. శాంతికి మూడో నెల. అన్నయ్య వచ్చి తీసుకెళ్ళాడు. ఏడాది, రెండేళ్ళు, మూడేళ్ళు గడిచాయి. సారథి — శాంత జీవితసారథి తిరిగిరాలేదు. ఒక్కసారైనా చూడ్డానికికూడా రాలేదు. ఉత్తరాలు నాలుగేసి పేజీలవి మొదట్లో వచ్చేవి. ఆతర్వాత పదిహేనురోజులకొక ఇన్‌లాండ్ కవరు సగంపేజీ రావడం, ఆతర్వాత నెలల వరకూ అదీ రాకపోవడం క్రమంగా జరిగాయి — పచ్చగా వున్న చెట్టు ఋతుక్రమం ప్రకారం వాడి, ఆకు రాల్చి, మోడైనట్లు. కానీ యిది మళ్ళీ చిగురుపట్టేలాగు కనబడలేదు.

మొట్టమొదటిసారిగా అయ్య్యపేరున ఢిల్లీ యూనివర్శిటీలో అసిస్టెంటు లైబ్రేరియన్‌గా చేస్తున్న అన్నయ్య స్నేహితుడు వ్రాశాడట — సారథి ఎవరో అమ్మాయితో కలిసి తిరుగుతున్నట్లు. 'బావదగ్గిర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా?' అని ఎంతో యథాలాపంగా అడిగేఅతని ప్రశ్న వెనక ఎంతబాధ దాచుకున్నాడో ఆతర్వాత అర్థమైంది శాంతకి. బిత్తరపోతూ, ముఖంలోని వెలితిని కనబడనివ్వకుండా 'నిన్ననేగా వచ్చింది!' అంటూ ఆమె ఆడిన అబద్ధం విని, పిచ్చిచలపతి తన స్నేహితుడు వ్రాసింది నిజం కాదని అనుకునేవాడు.

అల్లుడు రాలేదని, యింక రాడేమోనని అమ్మకి అనుమానం మొదలైంది. ఎల్లాగు చేరుతాయి అల్లాంటివార్తలు. ఎవరు చెప్పారో, ఎల్లాగ తెలిసిందో తెలియదు — కానీ సారథి ముస్లిమ్ మతం పుచ్చుకొని ఒక ఉత్తరదేశపు యువతిని పెళ్ళి చేసుకున్నాడని తెలిసింది యింట్లో. పిచ్చెత్తినట్లుగా గంతులేశాడు. ఆ ముసిలాయన, "ఇంత దగుల్బాజీతనం చేస్తాడా!" అని తిట్టాడు శాంత లేవనే లేదు ఏడుస్తున్న శేషుని ఆరోజు చూసినవారేలేరు.

చలపతి ఢిల్లీ వెళ్ళాడు. తను ఎంతో మురిపెంగా చూసుకున్నబావ యిల్లా చేశాడంటే నమ్మలేకపోయాడు. ఎవరి చేతుల్లోనూ సవరించడానికి ఏమీలేదని విజయసారథి సంసారంచూస్తే తెలిసింది. నాలుగుమాసాల కూతురితో, ఆ ఉత్తర



దేశపు వనితతో కలిసి కారులో వెడుతున్న అతన్ని చూడగానే చలపతికి వెన్నులో పోటు పొడిచినట్లైంది. 'శాంతకి యింత అన్యాయం చేశావేం బావా!' అని అడగాలని వెళ్ళినవాడు చెల్లెలి పేరే ఎత్తలేకపోయాడు. అత నింటికి తిరిగిరాగానే, అతనిముఖంచూచి తన సంసారం ఏమైందో గ్రహించింది శాంత. ఎంతో వైభవంగా పెళ్ళి చేశానను కున్న ఆ గృహస్థు చితికిపోయాడు. అమ్మ విచిత్రంగా మారిపోయింది. సారథి అక్కగారింటికి వెళ్ళి వచ్చాడు చలపతి. అన్యాయం జరిగిందని వాళ్ళూ అన్నారు. కానీ ఏమిలాభం! అసలు మనిషికే మనస్సు లేనప్పుడు ఎంద రెన్ని అంటే ఏం లాభం!

బ్రతుకంతా తనతో గడుపుతానని అన్నమనిషి, అంత హఠాత్తుగా ఎల్లా త్రెంపేసుకోగలిగా రీ బంధనాన్ని! ఏదో పెద్ద ఉద్యోగం వేయించుకుని, తిరిగివచ్చి తనని సుఖపెడతారని అను కున్నది గానీ, యిల్లా నట్టేట్లో వదిలేస్తా రనుకోలేదే! పెళ్ళి కాకముందు అమ్మకీ, నాన్నకీ భారమైతే, యిప్పుడు రెట్టింపు భారమైంది. 'ఎందుకిల్లా చేశాడు!' అని అమ్మ బిగ్గరగా ఆలోచిస్తోంటే, వళ్ళు కంపరమెత్తేది శాంతకి. 'పెళ్ళి నాడే తెలుసుగా నీ అందచందాలు, క్రొత్తగా ఏమి అవతారం వచ్చిపడింది — బిడ్డతల్లి అనైనా తోచలేదు!' అనేది. "వడ్డీతో సహా పంపేశాడు మాసొత్తు మాకు!" అనేది. నాలుగేళ్ళ పసివాడు శేషు ఏడుపు చెవులకి అడ్డు తగలకపోతే శాంత ఏమయేదో!

అందరూ నిద్రపోతున్నప్పుడు, అర్ధరాత్రివేళ గదిలో వెన్నెల పడు తోంటే, శాంత ఒక్కతీ మెలకువగా కూర్చునేది. వెన్నెలని చూస్తే, ఏమీ పట్టనట్టు ప్రకృతి ఎలా అందాలు చిందు తోందో నని కసి కలిగేది. ఈ స్థితికి కారణమైన అతనిమీదా కసి కలిగేది.

... బి. ఏ. పూర్తిచేసిన తరువాత శాంతకి వేరే ఒక చిన్నవూళ్ళో టీచరు పని కుదిరింది. శేషుకి ఆరో ఏడు వచ్చింది. వాడికి తాతయ్య అక్షరాభ్యా సము చేశాడు. 'అక్కడే చేర్పిస్తాను నాన్నా!' అంటే ఆయన కాదనలేదు. చలపతి సంసారమూ భార్యా, ఒక పిల్ల వాడితో పెద్దదైంది. ఎవరి సంసారం వాళ్ళకుండడం మంచిది. అమ్మ తనతో వస్తుందేమో సాయానికి, అంటే ఆవిడ సుముఖంగా లేదు. 'ఇక్కడే వుండ రాదా?' అంటుం దావిడ. శాంత ప్రయా ణమై బయలుదేరింది. పెళ్ళితర్వాత యింత సారెతో పంపిన పిల్లని యీనాడు ఒక పెట్టెతో మాత్రం బండీ ఎక్కిస్తూ ఆతల్లీ, తండ్రీ గుండెలు భారమైపోగా, కళ్ళు తుడుచుకున్నారు.

స్కూలులో థర్డ్‌ఫారం వరకూ ఉన్నది. ఆడపిల్లలకీ, మగపిల్లలకీ




కలిపే. దగ్గర్లోనే యిల్లు దొరికింది పద్దెనిమిది రూపాయలకి. ఉద్యోగానికి పోస్టుద్వారా దరఖాస్తు పంపితే, దాని మీదే సెలక్షనుఆర్డరు పంపారు వాళ్ళు. పిల్లవాడిని చూసినతర్వాత హెడ్మాష్టరు గారు 'మీరు మేరీడాఅండీ?' అనడిగారు. అప్లికేషల్లో తనురాసింది ఆసంగతి; కానీ ఎందు కడిగినట్లు? తనకి పెళ్ళయిందనీ, కానీ కానట్లే లెఖ్ఖనీ, తనకి భర్త లేనట్లే లెఖ్ఖనీ క్షణక్షణం మనస్సులో అనుకుంటున్నప్పటికీ తేలిగ్గా జవాబు చెప్పలేకపోయింది శాంత.

"ఔనండీ – వారు యిక్కడికి రారు. వేరే వుంటారు," అనగలిగింది. పుట్టింటికి వెళ్ళినక్రొత్తలో ఆయ నింక రారని తెలిసినప్పుడు నలుగురూ తనని వింతగా చూశారు. కానీ, ఆ అపవాదుభారం అంతా మీదపడింది. తను ఒకత్తే యిప్పుడు. లోకానికి ఎదురుపడవలసి వస్తోంది.

శేషుని రెండోక్లాసులో చేర్పించింది. వాడికి మాటలు బాగా వచ్చాయి. ఆరేళ్ళకే చాలామాటలు మాట్లాడుతాడు. ప్రొద్దున్నే లేస్తూనే బడికి వెళ్ళడానికి హడావిడి పడతాడు. పంపుదగ్గర తనుంటే పరుగెత్తుకొచ్చి చన్నీళ్ళే పోసుకుంటానని పేచీ పెడతాడు. మొదట్లో వాడికి గడియారం చూడ్డం చేతకానప్పుడు. 'పో! యింకో గంటయ్యాక రావాలి!' అంటే ముంగిట్లోకి వెళ్ళి మొక్కలమధ్య ఆడుకునే వాడు. ఐదేసి నిముషాల కొకసారి వచ్చి,

'అమ్మా! గంటయిందా!' అనేవాడు. రెండు నెలలై వాడికి టైము చూడ్డం చేతైంది.


"అమ్మా! అమ్మా!" అంటూ అస్తమానం వాడు కొంగు పట్టుకుని తిరుగుతోంటే, శాంతకి అనిపించేది–స్వంత మనుష్యులకోసం వీడెంతగా మొహంవాచిపోతున్నాడో నని. అన్నీ తనే వాడికి. వాడితో ఆడుకునేందుకు వచ్చే వేణు 'మానాన్నగారు కోప్పడుతారు' అని ఏదో చెబుతోంటే, శేషు ఏమంటాడోనని ఎదురుచూసేది శాంత. 'మా అమ్మ ఏమీ అనదు,' అనేవాడు.

ఇల్లాగ విసిరిపారేసినట్లుగా, ఎవరితోనూ సంబంధం లేకుండా యిదివరకెప్పుడూలేదు. ఇప్పుడిదే అలవాటౌతోంది. పుస్తకాలు, పరీక్షపేపర్లు, శేషుకిచదువుచెప్పడం, యింకా ఏవోవిషయాలు చెపుతుండడం– దాంతోటే గడుస్తోంది. కానీ వంటరిగా, అతివంటరిగా, నల్లని ఆకాశంక్రింద పడుకుని, మిణుకుమనే చుక్కల్లోకి చూస్తోంటే, గుండె బరువెక్కిపోయేది. శేషుకి దగ్గరిగా జరిగి, వాడిమీద చేయి వేసుకుని కళ్ళు మూసుకునేది.

అమ్మ ఉత్తరం వ్రాసింది – నాన్నగారికి బాగుండడంలేదనీ వేసవి సెలవల్లో వచ్చివెళ్ళమనీ వ్రాసింది. చివర వ్రాసిన వాక్యం చదవగానే మనస్సు చాలా చెదిరిపోయింది. "మీఆయన నీమధ్య యీవూరు వచ్చాడని అన్నయ్య స్నేహితుడు చెప్పాడు. నువ్వెక్కడున్నావో అడిగి తెలుసుకున్నాడుట. మనింటికి రాలేదు," అని వ్రాసింది అమ్మ.

తనెక్కడున్నదీ ఏడేళ్ళ తర్వాత యీరోజు ఎందుకు కావల్సివచ్చింది ఆయనకని కోపంగా ప్రశ్నించుకున్నది శాంత. ఏమైపోతుందో, ఏమైపోయిందో ఆలోచనుంటే అల్లాచేస్తారా? కుమిలి కుమిలి ఏడుస్తూ, అన్నిఉత్తరాలు వ్రాస్తే సమాధానం వ్రాయని మనిషికి ఎందుకు తననిగురించి ఆలోచన రావాలి?

రోజంతా చాలా చిరాకుగా ఉందామెకి. శేషుమీదకూడా విసుక్కుంది. బాగా చీకటిపడేవరకూ అన్నమే వండలేదు, అల్లా పడకుర్చీలో కూర్చుండిపోయింది. తనమనస్సు మొండికెత్తింది. తన దురదృష్టానికి విచారపడడానికి కూడా ఓపిక లేకుండా మొద్దుబారింది. నిజానికి ఆయన తనంటే ఎప్పుడూ అంత ప్రేమ చూపించలేదు. తనే భ్రమపడింది. ఏవో వూహించుకుని మమత పెంచుకుంది. కానీ – యిప్పుడూ ఆయనమీద అదీలేదు. ఇంత అన్యాయమైపోయానే అని తలచుకున్నప్పుడు దుఃఖం వస్తోంది. శేషుని చూసినప్పుడు, నాన్నలేని వాడిని చూసినప్పుడు కడుపు తరుక్కుపోతుంది. చేరదీసి "బాబూ! ఏం చేస్తున్నావు!" అని గుండెలమీద పడుకోబెట్టుకు, కబుర్లు




చెప్పే నాన్న వాడికి లేడనేసరికి దుఃఖం వస్తుంది. ఇంత అన్యాయం వీడి కెందుకు జరగాలని కసి కలుగుతుంది.

"అమ్మా!" అన్న శేష లేతకంఠం వినబడి లేచింది. వాడికి అన్నంపెట్టింది. తనకి తినాలనిపించక మళ్ళీ అల్లాగే కూర్చుంది.

"దా అమ్మా – పడుకుందాం." అని పిలిచాడు వాడు కాస్సేపు ఆడుకున్నాక. మంచంమీద దోమతెర వేసి, వాడి ప్రక్కన పడుకుంది. "కథ చెప్పమ్మా!" అంటాడు రోజూ. అలావాడు అడక్కుండా కళ్ళు తెరచుకుని గదిమూల కప్పుకేసి చూస్తున్నాడని కాసేపటికి గమనించింది శాంత. అక్కడ పిచ్చుకలు గూడు కట్టుకుని వున్నాయి. కిచకిచ మంటూ గోల చేస్తున్నాయి. ఒకపెద్ద పిచ్చుక తిరిగి తిరిగి వచ్చి, గూటికి దగ్గరగా వున్న చెక్కమీద నిలబడుతోంది. లోపలవున్న పిల్లలు ఎర్రని నోళ్ళు తెరిచి, పెద్దగోల చేస్తూ అది పెట్టినవి తింటున్నాయి. అల్లా చూసి, చూసి శేష నవ్వాడు. "అమ్మా చూడమ్మా – చూడమ్మా – అది నాన్న పిచ్చుక కదూ" అంటూ సంబరంగా నవ్వాడు. శాంత కొంచెం ఆగి, "అది అమ్మపిచ్చుకే, నాన్న పిచ్చుక అల్లా 'ఓ' పోయింది షికారు. ఇంటికి రాదది" అన్నది.

పదిహేనురోజుల తర్వాత ఒకనాడు మధ్యాహ్నం క్లాసులో ఉండగా, పోస్టు

మేన్ ఒక కవరు తెచ్చి యిచ్చాడు శాంతకి. ఎడ్రెసు వ్రాసిన దస్తూరీ చూడగానే చెబుతున్న విషయం ఒక్కసారిగా మర్చిపోయిందామె. కంగారుగా ఐంది మనస్సు. ఆరేడేళ్ళ క్రితం ఎప్పుడో చూసిన ఆ అక్షరాలు చిత్రంగా పలకరిస్తూ కనబడ్డాయి. అవి కనబడకుండా, కవరుని వెనక్కి త్రిప్పి టేబులుమీద వుంచి, మళ్ళా పాఠం మొదలుపెట్టింది. ఇంకా రెండు పీరియడ్లున్నాయి. కానీ శాంతకి ఉండాలనిపించలేదు. ఎందుకు వ్రాశారు ఆయన అన్న విపరీతమైన సందేహం, ఏమి వ్రాశారో నన్న భయమూ కలుగుతున్నాయి. హెడ్మాష్టరుగారితో వెళ్ళి చెప్పింది – చాలా తల నెప్పిగా వుంది వెళ్ళిపోతా నని. గేటువరకు వెళ్ళిన తర్వాత, వెనక్కి తిరిగి, వరండాలో వున్న నౌకరుని కేకేసి, "బాబుని యింటికి తీసుకొచ్చి దిగబెట్టు," అని చెప్పింది. నిజానికి వాడే వచ్చేస్తాడు రోజూ, కాని అల్లా చెప్పా లనిపించింది.

ఇంటికి వెళ్ళి, తాళం తీసుకుని లోపలికి వెళ్ళి కూర్చుని విప్పింది కవరు. శేషుపేరున వ్రాశారు ఆయన వుత్తరం: 'అమ్మ నీకు చెప్పేవుంటుంది నే నెక్కడున్నానో. ఇక్కడ చెల్లాయి, మేమూ కులాసా. నీకు దీపావళికి బొమ్మలు, టపాకాయలు పంపిస్తాను. నువ్వు వుత్తరము వ్రాస్తే వచ్చి తీసుకెడతాను' అని వ్రాశా రాయన. క్రింద 'నాన్న' అన్న సంతకం.

కవరుమీద తనపేరు వున్నది. ఉత్తరం కవరులో పెట్టి రేడియో క్రింద దాచింది శాంత. చెయ్యేసి మనస్సంతా ఎవరో కెలుకుతున్నట్లుంది. ఎన్నివందల రోజులు తను ఆ దస్తూరితో వచ్చేకవరు కోసం ఎదురు చూసిందో – తీరా యిన్ని రోజులకి అది వచ్చేసరికి, ఏమీ సంతోషమే కాదు; లోపల మంటగా వున్నది. తన బ్రతుకుని తలచుకునీ, పాతస్మృతులను తవ్వుకునీ బాధపడటం చాలరోజులై మానేసింది. కానీ మళ్ళీ వాటిని వెలికితీసింది యీ ఉత్తరం. కూర్చోనివ్వకుండా, ఏమీ తోచనివ్వకుండా చేస్తోంది కడుపులోని మంట. అశాంతితో, సెగలుగా, పొగలుగా వ్యాపిస్తున్న ఆ మంటని భరిస్తూ మంచం మీద కళ్ళు మూసుకుని పడుకుంది.

ఎప్పటికో వాకిట్లో శబ్దమైంది. వాడు వచ్చాడు. లేచికూర్చుని, కళ్ళు తుడుచుకుంది. మరుక్షణంలో వచ్చి, తన వళ్లో వ్రాలిన శేషుని గట్టిగా దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టుకుంది.

"నాకు కుక్క కావాలి, వేణువాళ్ళింట్లో వున్నలాటిది" అన్నాడు శేషు. ఆమాటే అనుకుంటూ వచ్చినట్లుగా గుండ్రంగా మెరుస్తున్న కళ్ళమీద జుట్టు పడుతోంది. ఎర్రని క్రిందిపెదిమ ఏవో భావాలను పలుకుతూ కదులుతోంది. "అలాగే

నాయానా ! నా బంగారు తండ్రే, బాబాల కొండే !" అంటూ, వాడు తప్పించుకుని దూరమైపోతాడేమో నన్నట్లు మరింత దగ్గరకు అదుముకుంది శాంత.

ఆ సాయంత్రం వేణు వాళ్ళింటికి వెళ్ళడం, ఆ కుక్కడొమ్మ ఎల్లాంటిదో చూడడం, అలాంటిది అమ్మమ్మగారి వూరు వెళ్ళినప్పుడు కొనా లనుకోవడం జరిగాయి. మొదట్లో వేణువాళ్ళింట్లో శాంతని చాలా వింతగా చూశారు. ఆమె బొట్టుపెట్టుకుంటున్నది – కాబట్టి ఆయన ఉన్నారని తెలుస్తోంది. అసలు తనకథ ఏమిటో తెలుసుకోవాలని ఆ పిల్లవాడి తల్లి మాలతి ఎన్నిరకాల ప్రశ్నలు వేసిందో – శాంతకి చాల అసహ్యమని పించింది. తనేదో నేరస్తుడిలా తప్పించుకుని తిరుగుతున్నట్లుగా ఎందుకు వీరంతా యిల్లా చూస్తారో అర్థం కాలేదు. తనలో ఏదో లోపం ఉండడం వల్ల యిల్లా వేరుపడ్డా రనుకుంటున్నట్లు మాట్లాడుతారు. స్పష్టంగా చెప్పటం మొదట్లో కష్టమైనప్పటికీ, కావాలని అలవాటు చేసుకుంది. ఆతర్వాత మాలతి ఒకత్తెతోనే బాగా స్నేహం కలిసింది.

ఇంటికి వచ్చిన తరవాత శేషుకి ఆ ఉత్తరం గురించి చెబుదామా అనుకుంది, కానీ – వాడికి చెప్పవలసిన అవసరం ఏమీ కనబడలేదు. "మా నాన్నగారు ఢిల్లీలో వుంటారు. చాలా దూరం. ఇక్కడికి రారు," అని చెప్పడం తెలుసు



వాడికి. అంతకుమించి వాడికి అనవసరం అనుకుంది శాంత.

— ఆ వుత్తరాన్ని దాచిపెట్టడం తోటే శాంతికి సమస్య తీరలేదు. పది హేనురోజుల తర్వాత ఒకనాడు శాంతకు జ్వరంగా వున్నదని సెలవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయినప్పుడు, శేషు మూడుగంటలకే యింటికి వచ్చేశాడు. స్కూలు ప్యూను చిన్నపార్శెలు తెచ్చిపెట్టాడు. "మధ్యాన్నం బాబుచేత సంతకం పెట్టించి అయ్యగారు తీసుకున్నారండీ. ఆరి నాన్నగారు ఢిల్లీనుండి పంపించారట కాదుటండీ ?" అని అతను అడుగు

తోంచే శాంతముఖం ఎర్రగా అయిపో యింది. మాట్లాడకుండా అది తీసుకుని లోపలికి వెళ్ళి మంచంమీద కూర్చున్నది. ప్యూను వెళ్ళిపోయాడు.

శేషు పుస్తకాల సంచీ కిటికీలో పడేసి 'విప్పమ్మా — ఏమిటమ్మా అది?' అంటూ హడావిడి పడసాగాడు. చిన్నప్యాకెట్టు బట్టలై వుంటాయి. 'చిరంజీవి శేషు' అని వ్రాశారు. ఆయనే పంపించారు. శేషు, అమ్మ అల్లాగే కూర్చోవడం చూసి పైనున్న కాగితం చింపడానికి సిద్ధపడ్డాడు. "వద్దు, చింపకు," అన్నది విసుగ్గా, గట్టిగా ఆమె. ఎదురుగా శేషు నిల్చుని తనని చూస్తూండకపోతే, ఆ పార్శెలుని పట్టుకెళ్ళి కసిదీరా అవతలికి విసిరేసేది. శేషు అవతలికి వెళ్ళి పోయాడు. దిండుమీద తలవాల్చి పడుకుంది. జ్వరంతో బాటుగా ఆవేదన — పీటితో వళ్ళు మరింత వేడిగా వున్నది. తాపంగా వుంది. శేషుకి ఏమి చెప్పాలి తను? ఆయన పంపింది వాడికోసం — పోనీ వాడికి యిచ్చేద్దామా అంటే — మనస్సు ససేమిరా వప్పుకోడం లేదు. ఆయ నసలు ఎవరు — వాడికి తన యిష్ట మైనవి పంపడానికి? తనే పనికిరాకుండా పోయినప్పుడు, తన కడుపున పుట్టిన ఆ బిడ్డమాత్రం ఎల్లా పనికివస్తాడు!


ఇల్లా పడుకున్నా, తీరే సమస్యకాదు, తీరేబాధకాదు. మెల్లిగా లేచి వంటింట్లోకి వెళ్ళి స్టవ్ వెలించి నీళ్లు పెట్టింది తల పడిపోతోంది. పీటవాల్చుకుని కూర్చుని, గోడని తల ఆన్చుకున్నది.

"అయ్యో, జ్వరంతో లేవారేమిటండీ టీచరుగారూ?" అంటూ మాలతి వచ్చి దగ్గర నిలబడేవరకూ కళ్లు విప్పి చూడ లేదు.

"అట్టే జ్వరం లేదండీ," అని శాంత అంటూన్నప్పటికీ వినిపించుకోకుండా ఆమె, శాంతని చేయిపట్టుకుని తీసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టింది. కాఫీ కలిపి యిచ్చి, పాలు గ్లాసులో పోసి, శేషుని కేకేసి యిచ్చింది.

"వేణు చెప్పాడు మీకు జ్వరమని. ఈవేళ శేషు పెందలాడే వెళ్ళిపోయా డుటగా — ఏదో పార్శిలు వచ్చిందట; పోస్టుమేన్ తెచ్చాడుట," రెండు చేతులతో పాలగ్లాసు పట్టుకుని త్రాగుతున్న శేషుజుట్టు సవిరిస్తూ, చిరునవ్వుతో అడిగింది మాలతి. ఎంతమందికి తెలియాలో అంతమందికీ తెలిసింది. ఎవరు పంపిందీ తెలిసింది. అందరికీ గొడవగానే వుంది తనసంగతి.

"బౌనండీ, మా నాన్నగారు ఢిల్లీ నుంచి పంపించారు నాకు. మా అమ్మ ఎక్కడో దాచేసింది," పాలగ్లాసు మాలతి చేతి కిచ్చి వెదకడం ఆరంభించాడు. "చూద్దాంలే, రా, యీకాసినీ. త్రాగేయి" అంటూ మాలతి బలవంతాన పట్టుకుంటే నిలబడ్డాడు వాడు. శాంత కిదంతా చాల బాధగావుంది. స్వవిషయం యింట్లోది




యింట్లోనే వుండకుండా నలుగురికీ తెలిసింది. ఇంక ఏమీ అనలేదు మాలతి. జ్వరంగురించి అన్నీ అడిగి తెలుసుకుని, లేచింది. "శేషు రాత్రికి మాయింట్లో తింటాడు. మీకు కొత్త చారు, అన్నం పంపిస్తాను. మీరుమాత్రం లేచి తిరగ కండి," అని చెప్పింది.

శాంత లేచి, ఆమె వద్దంటున్నా వినకుండా తలుపువరకూ వెళ్ళింది. "నన్నుగురించి మీకందరికీ బాధే" అన్నదిశాంత — కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మాలతి నేలవంక చూస్తూ నిలుచున్నది. తలెత్తి "మీ రెందుకండీ అంత యిదవు రారు? పిల్లవాడి విషయంలో అంత పట్టుదల దేనికి?" అన్నది. కొంచెంఆగి, "వేణుచెప్పాడు వాళ్ళ నాన్నగారు ఏదో పంపించారని; ఆయన నిల్లాగైనా దగ్గరవుతున్నందుకు సంతోషపడాలి మీరు," అన్నది.

శాంత అడ్డంగా తలూపింది "వద్దండీ — నా కిష్టంలేదు. ఎంతిదిగా పెంచుకున్నానో అంత నిర్దయగానూ తెంపేశారండీ. వీడుకూడా నాక్కాకుండా పోతాడు. ఆమాటమాత్రం మీరు చెప్ప కండి నాకు. వాడికికూడా లేనిపోని ఆలోచనలు కలిగించడం నా కిష్టంలేదు."

కళ్ళనిండా నీళ్ళు నిండుతోంటే యిల్లా అంటూన్న ఆమెనుచూసి మాలతికి చాలా జాలివేసింది, "మీరు వెళ్ళి పడుకోండి. ఏమీ హైరానుపడవద్దు. అన్నీ అవే సర్దుకుంటాయి —" అన్నది. "నేను వస్తాను. రేపొద్దున్న వేణుని పంపి స్తాను. రారా శేషూ, అన్నం తిని వద్దువు గాని," అని తీసుకువెళ్ళిందామె. శాంత

వెనక్కి తిరిగివెళ్ళి మంచం మీద పడుకుంది. ఎవరితోటీ సంబంధంలేకుండా వక్కత్తే పడుకోవాలనుంది. కళ్ళు మూసుకున్నది.

ఎప్పుడు నిద్రపట్టిందోగానీ, లేచేసరికి లైట్లన్నీ వేసివున్నాయి. వళ్ళంతా చెమటపట్టింది. జ్వరం జారినట్లుంది. లేచికూచుంది అతిప్రయత్నంమీద కిటికీ వేపుకి తిరిగి కుర్చీలోకూర్చుని వున్నాడు శేషు, ఏదోచేస్తున్నాడు. చటుక్కునలేచి నిలబడిందామె. క్రొత్త సిల్కుచొక్కా వళ్లోపెట్టుకుని పరీక్షిస్తున్నాడు, పేకట్టు విప్పి, అట్టపెట్టె క్రిందపడేసివుంది. వెళ్ళి చొక్కా వాడిచేతిలోంచి లాక్కుని క్రింద పడేసింది. వాడు భయపడుతూ నిలబడ్డాడు. "వెధవా, చెబితే బుద్ధిలేదూ? ఎందుకు తీశావు?'' వీపుమీదొక్క చఱుపు చరిచింది. వాడు బిగ్గరగా ఏడుస్తోంటే, ఆ చొక్కా తీసి అట్టపెట్టెలో పడేసింది. దాన్లోవున్న కాగితం విప్పి చూసింది, "శేషుకి – నాన్న'' మళ్ళీ – యింత పెద్ద ఉత్తరం వ్రాశారు. అవన్నీకలిపి మంచం క్రిందకి తోసేసింది. కిటికీలో వున్న బైండు తీసి, అలమరలో పడేసింది.

శేషు ఏడుస్తూ బయటికిపోయాడు. వంటింట్లోకి వెళ్ళి చూసిందిశాంత. చిన్న కారియర్ వుంది. కొంచెంతిని, పడుకుందామని కూర్చుంది. కానీ – ఏమీ తినబుద్ధి కాలేదు. అవి అల్లానే వుంచి, గిన్నెలో వున్న చల్లారిపోయిన పాలు, పంచదారైనా లేకుండా గొంతుకులో పోసుకుంది. వచ్చి మళ్ళీ మంచంమీద పడుకుంది. వాడు ఏడుస్తున్నాడు. ఏమిటయింది. అది తీయొద్దంటే, ఏదో ఎరచూపి వాడిని వశం చేసుకోవాలని ఆయన చేసిన యోచన బాగానే పనిచేస్తోంది. ఢిల్లీలో బొమ్మ లున్నాయి, మేడలున్నాయంటూ ఎందుకు వ్రాస్తారు పదే పదే! చెల్లాయిట – అది వీడికి ఏమీ కాదు. తనని నాశనం చేసి, శేషు నోటి దగ్గర సిద్ధాన్నం కాలదన్ని ఆ సంతానం – వీడికి లేనివన్నీ దానికున్నాయి. అసలు తనకే – ఏమీలేదు. ఉన్న ఒక్క సంపదనీ లాక్కుందా మనుకుంటున్నా రాయన.

లేచి – వరండాలోకి వెళ్ళింది. గోడ నానుకుని కూర్చుని బైటికి చూస్తున్నాడు శేషు. 'రా' అని వాడి చెయిపుచ్చుకుని లోపలికి తీసుకొచ్చి, తలుపు గడియ వేసిందామె.

ఆ తర్వాత నెలరోజుల్లోనూ రెండు కవర్లు వచ్చాయి – అన్నీ స్కూలు అడ్రెస్సుకే. శాంత వాటిని త్రిప్పిపంపేసింది. పుచ్చుకుని చింపేద్దా మనుకుంది. కానీ, ఆయ నింకా వ్రాస్తారనిపించి, త్రిప్పి పంపింది.

ఆ చొక్కా, లాగూ మాత్రం అల్లాగే వున్నాయి. పెట్టెలో అట్టడుగున వున్నాయి. త్రిప్పి పంపాలంటే పార్శెలు కట్టడం, అది పంపడం – అన్నీ అందరికీ తెలుస్తాయి. శేషు యిక వాటి

మాట ఎత్తలేదు. వేసుకుంటా నని పేచీ పెట్టలేదు. ఆమె వాటిని దాచిన సంగతి వాడికి తెలుసు.

సెలవుల్లో వూరికి వెళ్ళింది శాంత. ఆమె వెళ్ళగానే నాన్నగారు కన్నీళ్లు పెట్టుకున్నారు. శేషుని దగ్గరకు తీసుకుని ఆయన ముద్దు చేస్తోంటే, ఆమెకి గుండె బరువెక్కింది. వాడు తాతతో అంత త్వరగా కలసిపోతా డని ఆమె అనుకోలేదు.

మాటల్లో వాడు ఈ ఢిల్లీ గొడవంతా చెబుతాడేమో నని భయపడింది శాంత. అమాటే ఎత్తలేదు వాడు. అమ్మకి ఏది యిష్టం, ఏది అయిష్టమో తెలుస్తోంది వాడికి, అదేదో తను అనకూడని, అనుకోకూడని విషయమని అర్థమైంది.

అమ్మమాత్రం ఎన్నిసార్లో సారథి విషయం మాట్లాడింది. "అక్కడికి వచ్చాడుటే?" అనడిగింది శాంతని. "రాలేదు. ఎందుకొస్తారు, ఏం పని?" అన్నది కోపంగా శాంత.

"నామీద కోపం దేనికి? అడ్రెసు తీసుకున్నాడు కదా—వచ్చాడేమో అనుకున్నాను," అన్నది. అతను ఉత్తరాలు వ్రాసినట్లు, తను త్రిప్పి పంపినట్లూ, శేషుకి బట్టలు పంపినట్లూ—అన్నీ అమ్మకి మాటల్లో చెప్పక తప్పలేదు. కానీ—మాలతితో మాట్లాడినంత స్వేచ్ఛగా కూడా అమ్మతో మాట్లాడలేదు.



చలపతికి సిమ్లాదగ్గర ఎక్కడో పెద్ద ఉద్యోగం అయేలా వుంది. అతను చెల్లితో చాలా అపేక్షగా వున్నాడు. శేషు అయితే అసలు మామయ్యని వదిలి పెట్టడం లేదు. వదిన పుట్టింటికి వెళ్ళింది పురిటికి.

స్కూలు విషయాలన్నీ చెప్పింది శాంత. "ఎమ్. ఏ. కి వెళ్ళాలి శాంతా నువ్వు, నే నుండగానే! వివరాలన్నీ కనుక్కొస్తాను. తప్పకుండా ప్యాసై పోతావు," అన్నాడు. నాన్నగారూ, అన్నయ్యా మాత్రం ముగిసిపోయిన ఆ సంగతి గురించి మాట్లాడడం లేదు.

తను ముందునుంచీ చదువుకుని, ఉద్యోగంలో స్థిరపడినట్లే మాట్లాడుతున్నారు. మనుష్యులందరూ ఎందుకల్లా ఉండరు?

మర్నాడు ప్రయాణమనగా చలపతి, చెల్లెలిదగ్గర సారధి ప్రసక్తి తెచ్చాడు. "అమ్మ చెప్పింది — అతను ఉత్తరాలు వ్రాశాడట కదూ" అన్నాడు రేడియో ముల్లు త్రిప్పుతూ, తన వంక చూడకుండా అన్నా డీమాట. ఎంత సంకోచంతో ఎత్తాడో గ్రహించుకున్నది శాంత. "ఔను వ్రాశారు; శేషుకి బట్టలు పంపించారు," అన్నది.

"మనిషి మారినట్లున్నాడు," అన్నాడు. శాంత ఏమీ బదులు పలుకలేదు. "పోనీ జవాబు వ్రాయలేకపోయావా?" అన్నాడు. దానికీ శాంత ఏమి అనలేదు. "మీ రిద్దరూ అక్కడికి రావాలని అతిననుకుంటున్నాడుట — వాళ్ల నాన్నగారు నాతో అన్నాడు. విశాఖ పట్నంలో కలిసినప్పుడు," అన్నాడు మెల్లిగా.

ఆమెకే చాలా బాధ నిపించింది అన్నయ్య యీమాట అనేసరికి. "ఆయన యిష్టమైనవన్నీ అనుకుంటారు. మనం వినాలని ఎక్కడుంది?" అన్నది, కంఠంలో ఆవేశం ధ్వనించనీకుండా.

ఒక క్షణం ఆగి, "నేనువెళ్ళి అక్కడ ఉండాలని మీరంతా అనుకుంటున్నారా?" అన్నది. ఆమె కంఠంలో యీ మాట వినిపించిన తీవ్రతకి చలపతి తలత్రిప్పి చూచాడు. "అల్లా ఎందు కనుకుంటాం? ఊరికే సంగతికి చెప్పాను — నీ అభిప్రాయము తెలుసుకోవాలని చెప్పాను," అన్నాడు. రేడియో ఆపేశాడు. "నువ్వు మా కేం బరువని అంటావూ శాంతా ఆ మాట? ఎప్పుడూ అలా అనుకోవద్దు" అన్నాడు ఆవేశంగా కాస్సేపు ఇద్దరూ వూరికే కూర్చున్నారు.

ఆ తర్వాత చలపతి "రేడియో కావాలన్నావుకదూ — అది తీసుకెళ్లు నేను పెద్దమోడలు తెప్పిస్తున్నాను," అన్నాడు.

"ఎందుకు — అది నాన్నగారి కుంటుంది, నువ్వు క్రొత్తది పట్టుకెళ్లు సిమ్లాకి — నేను కొనుక్కుంటాను," అన్నది శాంత.

ఇద్దరూ అప్పటికి ఆవేశాలు మరిచి శాంతంగా అయినారు.

* * *

అన్నయ్యని వెంటనే రమ్మని వైరిచ్చామనీ, తననికూడా బయలుదేరి రమ్మనీ ఉత్తరం వచ్చింది వూరినుంచి. నాన్నగారికి చాలా ఎక్కువగా వున్నదన్నమాట శాంతకి గాభరగా వుంది. తనకి వెళ్ళాలని వుంది. కానీ శేషుకి స్కూలు ఫైనలు పబ్లికు పరీక్షలు జరుగుతున్నాయి. ఇంకొక్క పేపరున్నది. కానీ ఎల్లాగు వాడిని వదిలి వెళ్ళడం? అమ్మ క్రిందటిమాటు నాన్నగారికి బాగుండడం లేదని వ్రాసినప్పుడే అనుకుంది, పరీక్షలు పూర్తైన రోజునే



ఇదిగో చూడండి - మీరే ఇలా మారాం చేస్తే ఇహ పిల్లలు ఏం మాటవింటారు చెప్పండి

బయలుదేరి వెడదామని. కానీ, అంత వరకూ కూడా ఉండడానికి వీల్లేదులా వుంది.

శేషు సోషల్ స్టడీస్ పేపరు వ్రాస్తున్నాడు. వాడి కసలు ఆ పేపరు ఇష్టమే లేదు. వాడెల్లా వ్రాస్తున్నాడో, ఏం చేస్తున్నాడో నని భయంగావుంది ప్రొద్దుట్నుంచీ. వాడు నాలుగున్నరకి పేపరు వ్రాసి బయటకు రాగానే శాంత ఆత్రుతగా ఎదురు వెళ్ళింది. వాడు నవ్వుతూ రావడంచూసిసగంబరువుతీసేసినట్లైంది. 'బాగావ్రాశానమ్మా - అన్నీ వ్రాశాను' అన్నాడు ఉషారుగా. 'పద వెడదాం.' అని నాలుగడుగులు వేశాక, "తాతయ్యగారికి సీరియస్‌గా ఉందిట శేషు!" అన్నదామె. "టెలిగ్రాం వచ్చిందా?" అన్నాడు కంగారుగా వాడు. "లేదు; ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది. మామయ్యకూడా వెళ్ళాడు. నాకేం చేయాలో తోచడంలేదు. ఎల్లా వుందో టెలిగ్రాం యిద్దామనుకుంటున్నాను," అన్నది శాంత.

"నువ్వు వెళ్ళమ్మా - ఫరవాలేదు వెళ్ళమ్మా. సోషల్ ఐపోయింది గదా - ఆప్షనల్ మేథ్స్‌కి యింకా మూడురోజులు టైముంది; వెళ్ళు," అన్నాడు ఆగిపోయి. వాడల్లా అనడం బాగానే వుంది కానీ - ఇన్ని రోజులూ కంటికి రెప్పలా చూసుకుని చదివించి అంతా చివరికొచ్చి అల్లా వదిలేయడం ఎల్లా?

"వద్దు. నీకు పబ్లిక్ పరీక్ష కదా? నువ్వుండలేవు," అన్నది.

"ఉంటానమ్మా - వేణూవా ళింట్లో వుంటాను...పోనీ నేనూ వస్తా ఇవాళ్ళ నీతో," అన్నాడు.

"ఇంకానయం. చూద్దాంలే పద," అన్నది. ఇంటికి చేరిన తర్వాత శేషు ఒకటే పోరడం మొదలుపెట్టాడు వెళ్ళమంటూ. పట్టుమని పదహారేళ్లు లేవు వీడికి. ఎంత పెద్దవాడిలా తనకి సలహాలిస్తున్నాడో!

"ఐతే నేను వెళ్ళి చూసి, ఎల్లుండి రాత్రికి వచ్చేస్తాను. నువ్వు చదువుకుంటావా?" అన్నది చివరికి శాంత సందేహంగా.


వాడు మాటిచ్చినమీదట బైలుదేరింది. అక్కడ వున్నా కూడ మనస్సులో చాలా బెంగగానే ఉన్నది. వెళ్ళంది తోచదు కూడాను.

నాన్నగారికి చాలా ఎక్కువగావుంది. రోజులలోనని డాక్టరు చెప్పాడు. చలపతి ఏడిచాడు: "నాకు నాన్న ఎంతో చేశారు. నే నేమీ చేయలేకపోయాను ఆయనకి. దగ్గిరుండి మందైనా యిప్పించుకోలేక పోతున్నాను,'' అని. అతను ఎప్పుడూ దగ్గరే ఉండాలి; అమ్మ చెప్పింది. అంతకు ముందు వారంరోజులనుంచీ నాన్నగారు నిద్రపోలేదనీ, అన్నయ్య వచ్చిన గంట కల్లా సుఖంగా నిద్రపోయారనీ.

నాన్నకి మాటలేదు. కొడుకువంక చూస్తున్న ఆయనకళ్లు మిణుకుమంటున్నాయి. మెల్లిగా చేయి స్వాధీనం చేసుకుని, ఎత్తి అతనిచేయి పట్టుకుంటాడు. ఏదీ అని అడుగుతారు సైగలతో, అమ్మనిగురించి. "ఉన్నది. పిలుస్తాను. మీకేం భయంలేదు, పడుకోండి," అంటాడు అన్నయ్య. ఎన్నిసార్లో జరిగిందది.

శాంతని చూసి 'పిల్లవాడు రాలేదా' అని అడిగారు. పరీక్షలు వ్రాస్తున్నాడంటే నవ్వారు. ఏమి నవ్వది! శాంతకి చాలా దుఃఖంవచ్చింది! సింహంలా ఉండే మనిషి ఎల్లాగైపోయారో చూసి. ఇటువంటి దుర్బలత్వంలో ఆయన అన్నయ్యమీద పూర్తిగా ఆధారపడుతున్నారు. అమ్మని గురించీ, తననిగురించీ తాపత్రయపడుతూ, ఆధారమంతా అన్నయ్యమీద వేసి ఒక్క క్షణమైనా కునుకు తీస్తున్నారు.

వచ్చిన మర్నాటినుంచే శేషు దగ్గర్నించి ఉత్తరాలకోసం ఎదురుచూడసాగింది శాంత. మూడోనాటికి వచ్చింది. తను తిరిగి వెళ్ళాలన్న ముక్క ఎవరితోటీ అనడానికి వీల్లేకుండా ఉన్నది పరిస్థితి. అందరికీ తెలుసు నాన్న యింక ఉండరని. ఆయన కడుపులో మంట భరించలేక కేకలు వేస్తోంటే, "ఎప్పుడీ బాధనుంచి ఆయన్ని తప్పిస్తావు భగవంతుడా!'' అనుకుంటున్నారు. "వాడు ఒక్కడూ ఉండగలడా?" అని అన్నయ్య అడిగితే, "ఫరవాలేదు'' అన్నది శాంత.




శేషు ధైర్యంగా వ్రాశాడు ఉత్తరం. రాత్రి తొమ్మిదిగంటలకి జవాబు వ్రాద్దామని కూర్చుంది. వాడెల్లాగూ రెండు రోజులకి వచ్చేస్తాడు. రెండు వాక్యాలు వ్రాసిందోలేదో అన్నయ్య కంగారుగా కేకవేయడం వినిపించింది. పరుగెత్తు కెళ్ళింది. నాన్న చాలా ఆయాసపడుతున్నారు. కళ్ళవెంబడి నీళ్ళు కారుతున్నాయి. కళ్లు కనుపించని మనిషిలాగ వెతుకుతున్నారు చేత్తో. అన్నయ్య చేతిని పట్టుకున్నారు.

"శాంత"-అన్నాయి ఆయన పెదవులు. పదిహేనురోజులై లేని ధ్వని వస్తోంది, ఆయన గొంతులోంచి. అన్నయ్య దగ్గరగా వెళ్ళి, చెవిపెట్టి విన్నాడు. ఆయన పెదవులతో అన్న ముక్క విని "ఫరవాలేదు నాన్నగారూ - నేను చూసుకుంటాను. బావని కలిశాను. అన్నీ చక్కబడుతాయి," అన్నాడు. ఆయన తలూపారు. ఆ తర్వాత యింక స్పృహలేదు. ఏదోమూలుగులోపల్నించి; అదే - తెల్లారివరకూ. సూర్యోదయానికి ఆయన వెళ్ళిపోయారు.

చలపతిని పట్టుకునేవాళ్లులేరు. "కొండంత ధైర్యం నాకు - ఏదేశాలు తిరిగినా, నా దిక్కు కనుక్కునేవాళ్లు లేరు," అని చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడిచాడు. శేషు పరీక్ష అయీకాగానే బయలుదేరి వచ్చాడు. కర్మకాండ అంతా యధావిధిగా జరిగింది.

రెండు నెలలు సెలవు పెట్టాడు చలపతి. నాన్నగారి మనస్సులో ఏమున్నదో, అన్నీ సర్దుకున్నతర్వాత చెప్పాడతను. మళ్ళీ మనసులో గొడవపడింది శాంత.

"నా తండ్రిమీద నే నెంత ఆధార పడ్డానో ఆ అండలేకపోతే ఎంత నిరాధారమైనానో నాకు తెలుసు. వాళ్ళని ఎందుకు దూరం చేస్తావు ?" అన్నాడు చలపతి. శాంత మనస్సుని, యిష్టానిష్టాలకి లెక్కచేయకుండా యిదివరకు ఎన్నడూ యిల్లా ప్రశ్న వేయలేదు.

ఆవేశంతో అన్నయ్య యిలా అంటోంటే శేషు వింటాడేమోనని బిక్కచచ్చిపోయి విన్నది శాంత. "ఏం వింటే ? విననీ ; వాడికే చెబుతాను నీ కిష్టం లేకపోతే నువ్వు వెళ్ళకు," అన్నాడు.

"నాన్నగారు నిన్ను చూసినట్లుగా, ఆయన చూశారా వాడిని – తనకొడుకే కానట్లు వెళ్ళిపోయినారే – నేను ఏమి పాట్లు పడ్డానో ఆయన చూశారా అన్నయ్యా !" అన్నది శాంత.

"చూసేవాడేమో, నువ్వు పడనిస్తే కదా? – నాకు కనబడ్డాడు సారధి ఢిల్లీలో. నన్ను చూడగానే ప్రాణం లేచివచ్చినట్లు ఎంతో అపేక్షగా మాట్లాడాడు. శేషు బాగున్నాడా, ఎలా వున్నాడు, ఏం చదువుతున్నాడు అని అడిగాడు," అని చలపతి చెప్పుకుపోతుంటే –

"ఐతే జరిగినదంతా గుర్తేలేనట్లు మాట్లాడారా?" అన్నది శాంత చీకాకుగా. అందరూ ఆయన మంచితనాన్ని పొగిడేవారే – అమ్మా అంతే అనుకుంది.

"మర్చిపోయాడో, గుర్తుంచుకున్నాడో–అతనికున్న కొడుకు వీడొక్కడే. కూతురూ అదొక్కతే. నలభై ఏళ్లు వస్తున్నాయి. మంచిస్థితిలో వున్నాడు–శేషుకి ఎన్నివిధాల సాయపడగలడో ఆలోచించావా ?'' అన్నాడు చలపతి.

"ఎవరి దయాధర్మభిక్షం అక్కర్లేదు శేషుకి –" అన్నది ఉక్రోషంగా శాంత; చలపతి యింకేమీ అనలేదు; ఊరుకున్నాడు. చలపతికి మనస్సులో మమకారం పచ్చిగా వున్నది. తండ్రిలేని తనస్థితి, తండ్రి ఉండికూడా లేని స్థితిలో వున్న శేషుగతి పోల్చుకుని బాధపడ్డాడతను. పసివాడు, తండ్రి అండ ముఖ్యంగా యిప్పుడే కావలసినవాడు – వాడికది లోపైం దనిపించింది వాడిని చూస్తోంటే. అందుకే యిదివర కెన్నడూ మాట్లాడనంత తీవ్రంగా మాట్లాడాడు.

స్కూలు ఏప్రిలు చివరివరకూ పని చేస్తుంది. ఎంత ఉండాలనివున్నా వెళ్ళక తప్పదు. శేషువాళ్ళ మామయ్యతో బాగా వెంట వెంట తిరుగుతున్నాడు. మామయ్యపిల్లలన్నా యిష్టమే వాడికి.

స్టేషనుకి వచ్చాక అన్నయ్యతో చెప్పింది శాంత. మేనెల మొదటి వారంలో ఉత్తరదేశం ఎక్స్కర్షనుకి పిల్లలంతా వస్తారనీ, తనూ వస్తాననీ. "ఐతే– సిమ్లా తప్పకుండారా. రాకపోతే వూరుకోను. ఏరా శేషూ–నీదేపూచీ," అన్నాడు. శేషు నవ్వాడు. శాంత తలూపింది అల్లాగే వస్తానని.

రైలు వచ్చేలోపుగా, శేషు మామయ్యతో కలిసి బుక్‌స్టాలుదాకా వెళ్ళి యింగ్లీషు పత్రికలు కొని తెచ్చు కున్నాడు. రైలు రావడం, ఎక్కడం, కిటికీకి దగ్గరగా చేరి శాంత తాపీగా కూర్చోడం అన్నీ జరిగాయి. శేషు మాత్రం తలుపుదగ్గరే నిలబడి చలపతితో మాట్లాడుతున్నాడు. క్రొత్తైనాలేకుండా, తనూ పెద్దవాడిలా - ఏవిటో ఆమాటలు అనిపించింది; గర్వంగానూ వుంది ఆమెకి.

తిరిగి యింటికి వెళ్ళాక స్కూలుపని చాలావుండి, ఏ ఆలోచనకీ తీరికేలేదు. ఎక్స్‌కర్షనుకి శేషు పేరిచ్చాడు. ఉత్తర దేశంఅంతా చూడ్డానికి ఏర్పాటుచేశారు. మూడువంద లవుంది. ఆడపిల్లలు ఎనిమిదిమం దున్నారు. అందుకని తనని స్కూలుఖర్చుమీదే పంపుతున్నారు. అన్నయ్యదగ్గర వచ్చిన ప్రశక్తి తలచు కోగానే, ఢిల్లీకూడా వెళ్ళాలంటే భయ పడింది శాంత. "నేను రాకపోతే నువ్వు వెళ్ళలేవా శేషూ!" అంటే ససేమిరా వెళ్ళనన్నాడు.

స్కూలు మూసివేశాక ప్రయాణమై బయలుదేరారు. రైల్లో ఒక పెట్టెఅంతా పిల్లలే. హెడ్మాష్టరు, మరొక మాష్టరు వచ్చారు. శాంతా, ఆడపిల్లలు ఒక చిన్న భాగంలో కూర్చున్నారు. బయలుదేరిన నాడుకాక, మరునాడు రాత్రికి-అందరూ అలిసిపోయి కళ్ళు మూతలు పడుతోంటేకున్నది . గడిచిపోయిన సంవత్సరాలు -

ప్రక్కలమీద పడుకున్న సమయంలో శాంత అల్లా కూర్చుంది. రైలు ఎంతో వేగాన, లయగా చప్పుడు చేస్తూ నడు స్తోంది. చక్రాలు ఒకచుట్టు తిరిగేసరికి ఢిల్లీకి మరింత చేరువవుతున్నా మనిపించి శాంతగుండెలు దడదడలాడాయి.

తనతో కంటే కూడా, శేషు, మామయ్యతో అంత ఉత్సాహంగా తిరగడం చూస్తే, వాడు ఆ వయస్సు వాళ్ళతో ఎల్లా మసలుతాడో తెలిసింది. కళ్ళు మూసుకుని, పట్టాల చప్పుడు వినసాగింది శాంత. గాలి హాయిగావుంది. కళ్ళు తెరచి చూసింది. పెద్దకొండలు నల్లగా, పెనుభూతాల్లాగా వున్నాయి. మళ్ళీ కళ్ళు మూసుకుంది.

శేషు ఏమిచదువుతాడు?- డాక్టరా, ఇంజనీరా, ఐయ్యేఎస్సా-అది నిర్ణయించ డానికి, ఆప్రకారం నడిపించడానికి తనశక్తి సరిపోతుందా? వాడికి జన్మతః వచ్చిన హక్కుని తను పోగొట్టుతోందా? ఆ అమ్మాయికి అన్నీ వున్నాయి. వీడికి, తనతో గడిపే వంటరిజీవితం ఒక్కటే ఉన్నది.

కళ్ళుతెరచి చూసింది. వెన్నెల - చూపుకందినంత దూరం మైదానంలాగా వున్న ప్రదేశంమీద కాస్తున్న వెన్నెల. తను, తన సౌఖ్యం తన అభిమానం దాటి ఆలోచించలేని తన అశక్తతని తిట్టు

రైలుదాటి వెళ్ళిపోతున్న దృశ్యాల్లా వున్నాయి.

క్షణం దూరమౌతా దేమోనని ఎంతో గట్టిగా చలపతి చేయి పుచ్చుకున్న నాన్న గుర్తుకువస్తున్నారు. ఆ స్పర్శకి అన్నీ మరిచిపోయి, మీదకివస్తున్న మృత్యువునే మరిచిపోయి, సుఖంగా గుండెలమీద చేయి వేసుకుని నిద్రపోయిన నాన్న గుర్తుకు వస్తున్నారు. ఆ కన్నకొడుకు చేతిలో, ఆ కన్నతండ్రికి ఏమిశాంతి దొరికిందో!

వెచ్చనికన్నీరు బుగ్గలమీద జారుతోంటే, కళ్ళు మూసుకుంది. పొడుగ్గా సన్నగా ఉన్న సారథిరూపం – మసక మసగ్గా ఆ రూపానికి దగ్గరగా ఆనుకుని శేషు ఆకారం కనిపిస్తున్నాయి.

మర్నాడు ప్రొద్దున్న టీ త్రాగారందరూ, మట్టిపిడతల్లో. ఆడపిల్లలు పాటలు పాడారు; భజనలు చేశారు. మగపిల్లలూ పాడారు. అలిసిపోయి, కూర్చున్నా రందరూ. 'లూడో', పరమపద సోపానం ఆడుతున్నారు కొందరు. శేషుని కేకేసి, కంపార్టుమెంటు చివర వరకూ వెళ్ళి నుంచుంది శాంత; వాడితో మాట్లాడాలని; రాత్రే సిద్ధపడింది యీ పనికి తను.

"ఏమ్మా – తల నొప్పిగా వుందా?" అన్నాడు. "లేదు" అన్న దామె. తలుపు దగ్గరున్న కిటికీ నానుకుని, మోచేతులాన్చి, బయటకు చూస్తూ నిలబడ్డాడు. ఆమెకూడా కిటికీమీద కల్లాగే ఆనుకుని నిలబడింది. ఒక్కనిమిష మయ్యాక "ఢిల్లీలో నాన్నగారిని చూస్తావా శేషూ?" అనడిగింది. కొంచెం సేపయ్యాక ఏమీ జవాబు రాకపోయేసరికి, ప్రక్కకి తిరిగి చూసింది. వాడు కళ్ళు కొంచెం క్రిందికి వాల్చి. చూస్తున్నాడు కొద్దిగా ముడత పడింది మూతి.

"చెప్పు శేషూ! చూస్తావా" అన్నది. వాడు తలూపాడు. "తిరిగి వచ్చేటప్పుడు చూద్దువుగాని. మామయ్యకి టెలిగ్రాం యిచ్చి ఎడ్రెసు తెప్పిస్తాను," అన్నది.


వాడు ఏమీ అనలేదు. కానీ రెండు నిమిషాలు పోయాక, "ఎడ్రెసు నా దగ్గరుంది. మామయ్య యిచ్చాడు." అన్నాడు.

శాంత మనస్సు చివుక్కుమన్నది. "నువ్వడిగావా? తనే యిచ్చాడా?" అన్నది.

"తనే యిచ్చాడు" అన్నాడు.

తన ఒళ్ళో పడుకుని, ఆదమరచి నిద్రపోయే యీ పసికూన – యింత పెద్దవాడై, స్వంత ఆలోచనలతో, యిష్టాయిష్టాలతో ఒక వ్యక్తిగా తయారయ్యాడు. వాడివంక తదేకంగా చూసి, "మరి – నీ కిష్టమేనా – ఆయన్ని చూద్దం?" అన్నది.

శేషు తలూపాడు, వాడి పెదిమల చివర సన్న నవ్వు, కళ్ళలో చిన్నసిగ్గు చటుక్కున మెరిశాయి. తను బ్రతికిన




యీ పదిహేడుసంవత్సరాలు, ఆయనకీ వీడికీ మధ్య యేర్పడిని అగాధం, ఆ ముసి ముసి నవ్వుతో మాయమయ్యా యనిపించింది శాంతకి.

ఢిల్లీ చేరాక అన్నీ చూశారు. ఒక స్కూలు హాస్టలులో బసకి ఏర్పాటు. రెండోరోజున స్కూలుక్లర్కుకి ఆ అడ్రెసు యిచ్చి, ఎక్కడో తెలుసుకున్నారు. సరాసరి బస్సుందని తెలిసి, శేషు తాను వెళ్ళగలనన్నాడు. కానీ – ఆ క్లర్కుని బ్రతిమాలింది శాంత, వాడిని తీసుకువెళ్ళమని. ఆయన సరేనని ఒప్పుకున్నాడు

అందరూ సినిమాప్రోగ్రాం పెట్టుకున్నప్పుడు సాయంత్రంపూట వాడిని పంపించింది. ఏమి బట్టలు వేసుకోవాలో, జుట్టు ఎల్లా దువ్వుకోవాలో అని తను పడే తాపత్రయం అమ్మకి తెలియకుండా ఉండాలని ఎంతో తిప్పలు పడ్డాడు. వెర్రి నాన్న అనుకుంది శాంత. లోపల భయంగావుంది ఆమెకి. తన దగ్గర్నించి లాక్కుంటారని కాదు ... ఇదుగో నేను మలచిన శిల్పం అని తను చూపిస్తోంటే, అది చూసి ఆయ నేమంటారోనని.

"జాగ్రత్త బాబూ! తొందరగా వచ్చేయి. ఏం చెబుతావు ఆయనతో?" అని అమ్మ అంటోంటే, "తెలీదమ్మా!" అన్నాడు చనువుగా, మందలింపుగా. వాడు వెళ్ళినతర్వాత, శాంత ఆలోచిస్తూ కూర్చుంది. ఆయన వీడిని ఎల్లా చూస్తారో వూహించుకుంటే ఆవేశంగా వుంది. నాబిడ్డ, నావస్తువు అన్న భావనతో పులకరించినది ఆమె.

ఆడపిల్లలతో కలిసి సినిమాకి వెళ్ళక తప్పలేదు. శాంత, శేషు 'బంధువు

లింటికి' వెళ్ళాడని చెప్పింది హెడ్మాష్టరుగారికి. మీరు వెళ్ళలేదేం అని అడిగితే, పగటిపూట వెడతానంది.

తిరిగి హాస్టలుకి వచ్చేసరికి పది కావస్తోంది. భోజనాలు మూతలు పెట్టి ఉంచారు హాస్టలువాళ్ళు. వస్తూనే మగపిల్లల గదిలోకి వెళ్ళి చూసింది. శేష తన బెడ్డింగు పఱచుకుని పడుకున్నాడు. మిగిలిన పిల్లలు సినిమానుంచి తిరిగి వచ్చినవాళ్ళు వాడిని పలుకరిస్తున్నారు.

"శేషూ !" అని తలుపు దగ్గర్నుంచి పిలవగానే, లేచివచ్చాడు. వరండాలో దీపాలున్నాయి. ఆ వెలుతురులో వాడి ముఖం చూచిందామె. మామూలుగానే ఉన్నాడు. ఏమడగాలో వెంటనే తోచలేదు.

"ఎంతసేపైంది వచ్చి," అన్నది.

"అరగంటైంది," అన్నాడు వాడు.

"అన్నం తిన్నావా?" అంటే తలూపాడు. ఆయ నేమన్నారు, ఎల్లాగున్నారు, గుర్తుపట్టారా అని అన్నీ అడగాలని ఆత్రుత. కాని వాడేమిటో అల్లా స్తబ్ధుగా వూరుకోవడం చూచి, ఏదో బెరుకు కలిగింది.

తనుంటున్న చిన్నగదివరకు నడచి వెళ్ళాక, "నువ్వు ఎవరో ఎల్లా తెలిసింది ఆయనకి?" అన్నది.

"చెప్పాను నేను శేషునని — బాగా మాట్లాడారు," అన్నాడు.

"ఇల్లెలా వుంది?" అన్నది.

"బాగుంది," అన్నది.

ఆయ నెల్లాగున్నారు, నీకు నచ్చారా, చెల్లెలు అన్నావే, ఆ పిల్ల వుందా అని అడుగుదామనిపించింది.

గదిలోపలికి వెళ్ళి కూర్చున్నాక వాడి వంక తేరిపార చూచింది. వాడిముఖంలో సంతోషం లేదేమిటి? "ఏం శేషూ, అల్లా వున్నావు?" అన్నది దీనంగా.

కొద్దిగా ముఖం చిట్లించాడు. "బాగానే వున్నాను. నువ్వెళ్ళి అన్నం తినవా?" అన్నాడు.

"నువ్వు?" అన్నది మళ్ళీ.

"నేను అక్కడ తిన్నాను" అన్నాడు. వాడు ముఖం దించుకు కూర్చున్నాడు. "ఏమైంది శేషూ! ఆయన నిన్ను బాగా చూడలేదా?" అన్నది.

అమ్మ ఆత్రుత చూస్తే శేష మనసు చివుక్కుమంటోంది. "చాలా బాగా చూశారమ్మా — మళ్ళీ రమ్మన్నారు నన్ను. నిన్నూ రమ్మన్నారు," అన్నాడు ఎదిగొంతుకతో.

చటుక్కున ఆమెముఖంలో ముడుతలు వచ్చాయి. "నేను రాను," అన్నది. వాడి బిక్కముఖంచూసి వాడి వీపుమీద చేయి వేసింది.

"నువ్వు మళ్ళీ ఎప్పుడు వెడతావ్? సెలవుల్లో వస్తానని చెప్పకపోయినావా?" అన్నది. ఏమిటో బాధ వాడిలో — కొమ్మలు లేతగా వున్నప్పుడు చేర్చి కడితే అతుక్కుంటాయి; చిగిర్చి పూలు



పూస్తాయి; పెళుసువారి, బెరడుతప్పిన కొమ్మలు ఎల్లా అతుకుతాయి అనుకుంది ఆ వెర్రితల్లి.

సిగ్గు వదిలేసి వాడు, తనను తాను మర్చినట్లుగా ప్రక్కకి ఒరిగి అమ్మ వళ్లో తల దాచుకున్నాడు.

"నేను వెళ్ళనమ్మా అక్కడికి," అన్నాడు.

"ఏం నాన్నా —ఏమైంది—చెప్పవూ?" అన్నది గద్గద కంఠంతో వాడి జుట్టు సవరిస్తూ.

తన కేమిటికి మనస్సులో యిబ్బంది కలిగిందని చెబుతాడూ. తన మనస్సు కోసేసేలాగు అక్కడ ఏమి కనిపించిందని చెబుతాడు!

నలభై ఏళ్ళుకూడా రాకుండా పూర్తిగా నెరిసిపోయిన జుట్టుతో, ఏ ఆశలూ, మెరుపులూ లేని కళ్ళతో, గమ్యం చేరడానికి మూగగా నడిచే బండిఎద్దులా పని చేసే అమ్మని యీనాడు చూస్తే శేషు మనస్సులో ఏమిమంట రేగిందో వాడికి అర్థం కావటంలేదు. అది విడమర్చి చెప్పలేదు. కానీ — చిరునవ్వుతో, ఆనందమంతా నాదే అని మెరిసేకళ్ళతో, ఏ చీకూచింతా లేకుండా, ఠీవిగా, ఇంటికి రాణిలాగ తిరిగే 'ఆమె'ని చూస్తే— అమ్మ కోల్పోయిన నిధి ఏమిటో ఆ పసి హృదయానికి పదునుగా అర్థమైంది.

"ఎందుకు వెళ్ళవు శేషూ?" అని మళ్ళీ అమ్మ అడిగిన ప్రశ్నకి వాడు ఏడిచాడు.

"నువ్వు వెళ్ళకపోతే, నేనూ వెళ్ళనమ్మా అక్కడికి." అంటూ ఏడుపులో వాడన్నమాట విని, గుండెల్లోంచి దుఃఖం, ప్రేమ, అభిమానం అన్నీ తోసుకురాగా, తన కంఠం పూడుకుపోయింది. వాడిని ఓదారుస్తూ, కొంగు నోటికి అడ్డంపెట్టుకుని, శబ్దం పైకి రాకుండా ఏడిచింది శాంత.